# 1 ప్రేమకి మీసాలు

"కలకలలాడు వాలుజడకై
జగమెంత తపస్సొనర్చెరో"

అంటాడు కవి. అప్పుడప్పుడు జడ ''చెలియ భుజానవ్రాలి కుచసీమ నటించుచు" ముందుకు వచ్చినా పాపం మళ్ళీ వెనక్కు విసురుగా వెళ్లి ''కటిసీమ" ను నడయాడకతప్పదుకదా! ప్చ్! స్త్రీ సౌందర్య సుకుమార వయోవిలాస విభ్రమాదులకు ఆమె వయ్యారాల వాల్జడే సాక్షి. కాని ఈ జడ ఇలా పాపం వెనక్కే ఎందుకు వుండిపోయిందీ అని అస్మదాదులకో అనుమానం!

ఇంత డేంజరస్ ఇన్స్ట్రుమెంటు కదా ఈ వయ్యారాల వాల్జడ, దీన్ని అస్తమానూ వయో విలాసినులు ఉపయోగించకుండా కొంచెం వెనక్కే అసింటా అట్టేపెట్టడం ఒకవిధంగా దూరదృష్టితో ఆలోచించి చేసిన పనిలా తోస్తుంది. కళ్ళకుకట్టే కమనీయ సౌందర్యవంతా ముందుంచి దీన్ని కాస్త వెనక్కు నెట్టెయ్యడంలో సృష్టికర్త తెలివైన పనే చేశాడు. ఆడవాళ్ళు ముందుకడుగువేసినప్పుడల్లా వారిని జడపుచ్చుకుని లాగొచ్చు. ఇంజన్‌కి బ్రేకు అవసరంకదా. జడవంటి ప్రమాదకరమైన ఆయుధాన్ని ఆడవాళ్ళకిచ్చి అది వెనక వయ్యారంగా వ్రేలాడుతూ వుండేలా చేసిన ఏర్పాటులో చిన్న కుట్రవుంది. దీన్తాలూకు రాజకీయం ఏవిటంటే "నిలు నిలు బాలా" అంటూ జడ అందుకుని ఆపుచేస్తే రెండు చేతుల్తో ఎడాపెడా వాయించగలదు ఆ సుందరి (అది ఆమె ఇష్టం) లేక ఆమె వచ్చి జాక్‌పాట్‌లా వళ్ళో వాలనూగలదు. చిన్నకారులాటి సన్నకారు సుందరికైనా సడన్‌బ్రేకులవసరం. దీన్ని ఛాందసులు "వలపుల ఉరిత్రాడు'' అన్నారు.

దీన్ని మెడచుట్టూ తిప్పుకుని వలపుల గిలక ప్రతీదీ ''తెస్తావా— ధస్తావా'' అని మారాం చెయ్యొచ్చు. అంతమాత్రాన ఎవరూ చావరను కోండి. కాని చచ్చినంతపని అవుతుంది. ''హాండ్సమ్ ఈజ్ దట్ హాండ్సమ్ డజ్'' అన్నాడుకాని పూర్ గోల్డుస్మిత్, అందమైన వస్తు వులన్నీ అందమైన పన్లుచెయ్యవు. త్రాచుపాము ఎంత బ్యూటిఫుల్‌గా వుంటేమటుకు సుఖమేవిటి? టక్కుమని కాటేస్తుందికదా! పులి మీసాల్తో ఆడుకోలేముకదా! అలాగ అందమైన ఆడాళ్ళు అన్నిందాలా పనికిరారు. వాళ్ళవి చాలా కుళ్లుబోతుమనసులుకావచ్చు. చర్మం తెలుపేగానిమనస్సు కారునలుపు కావచ్చు. కళ్ళు విశాలనేత్రాలేకాని ఎదటివారినిచూసి ఓర్వ లేకపోవచ్చు. పైకి నవ్వేది చిరునవ్వేకాని అది కొంప తీయచ్చు. కట్టింది జల్తారంచు ఖరీదైన కోకేకాని లోపల చవకబారు కోరికలుండ వచ్చు.... ఒత్తైన నల్లని నిగనిగలాడే జుట్టుకల ఆడదానికి అంతఒత్తుగా లోపల మంచిఆలోచన్లు వుండటానికి బుర్రలో ఖాళీలేకపోవచ్చు.

ఇంత చక్కని జడను ముద్దుగా పిల్చుకోటానికి ఇంగ్లీషువారికి పిగ్‌టైల్‌కంటె మంచిమాటదొరకనేలేదా? పందికి తోకవంటిదని తాత్ప ర్యంకదా— గుర్రంకుచ్చులాటి జడఅని భాషనుందనుకోండి. ఐతే కొం దరాడవాళ్లు ఈ పిగ్‌టైల్ పిగ్‌కు వర్తిస్తుంది మాకు కాదని చమత్కరిం చవచ్చు. పిలకున్నవారికైనా జటాధారులకైనా 'పిగ్' అనటం ఏమంత బాగోలేదు. పరమబ్యాడ్ టేస్టుకి నిదర్శనం.

మరి ఈ పిగ్ టైల్‌మీద అలిగో కోపంవచ్చో కొందరు సుంద రాంగులు చక్కావేణీ సంహారం చేస్తున్నారు. క్కాదుకాదు- చేయించు కుంటున్నారు, తమాషాకో, కులాసాకో, ఖుషీకో.

వేణీ సంహారం అట్టే మంచిపద్ధతి కాదు. జడ లేకుండా జుత్తు బుజాలమీద విరబోసుకొని అమ్మశక్తిలా తిరిగేవారికి ముందు జాగ్రత్త ముందు చూపేకాని వెనుకచూపు లేదంటారు, కవితకు మెప్పు, వనితకు కొప్పు అన్నారా లేదా? పడకటింట్లో వలపులుచిలుకుతూ కులికే వన్నెల

విసనకర్రమ అందుకోడానికివాళ్లదైనా దొరక్కపోతే ఆ కథానాయకుడేం కావాలి? ఆడదానికి వాణీ సౌభాగ్యంకంటెకూడా వేణీ సౌభాగ్యమే మిన్న. శృంగారవీథిలో బాబ్డ్ హైర్‌కత్తెకు దేవిడీ మన్నాయే. చిన్నపిల్లలకీ ఓ వయసులోని వారికది ముచ్చటేకాని, జడసొగసు జడ సొగసే...... పువ్వులతోటలో నవ్వుల భరిణెలా గుండవలసిన ఆడదాని సొగసు చేతికందని ముళ్ళకంపవతు ఐతే ఎలాగెలాగ?

ఆడదానికి జడ ఎంత సొగసో మగవారికి మూతికి మీసం కూడా అంతే— తుమ్మెదరెక్కల్లాటి మీసాలు బుగ్గలకు తగిల్తే కితకితలుపెట్టి నవ్విస్తాయి. మరీ కృష్ణదేవరాయల్లాటి మీసాలక్కర్లేదు గాని మూతికి ఓ మోస్తరు మీసంకూడా అందవే...మీసాల్లేకపోతే తుచ్ఛసుఖములన్నీ మీసాలపై తేనియల్ అని ఎలా తెలుస్తుంది? మీసాలు లేనివాళ్ళకి (ఆడవాళ్ళకు కొందరు మగవాళ్ళకు పిల్లలకు) తుచ్ఛ సుఖములు మీసాలపై తేనియల్ కావా? ఏవిటో పెద్దనగారుకూడా ఇలా అవకతవకగా రాస్తారు?

స్త్రీ పురుషులమధ్య ప్రేమకలగటానికి మీసాలు దోహదకారులా, కావా అను విషయం పై హనుమాయమ్మ "ప్రేమకి మీసాలు" అని నవల రాసింది. ఆవిడ ఇదివరలో సీరియల్‌గా రాసిన "వలపులగిలక" చదివిన పాఠకులు "ప్రేమకి మీసాలు"లాటి నవల ఛస్తే మళ్ళీ మీరు రాయలేరని ఆవిడతో పంచెంకాశారట. "ప్రేమకి మీసాలు" సీరియల్‌లో కథానాయకుడు మీసాల్నెక్కువగా ప్రేమిస్తున్నట్లు కథానాయికను తక్కువగా ప్రేమిస్తున్నట్లు హీరోయిన్‌కి అనుమానం కలుగుతుంది. వెంటనే ఆవిడ ఆ మీసాల్ని తీసేయమంటుంది. మీసాల్ను అంతగా ప్రేమించిన ఆ హీరో తన మీసాల్ను తీసేస్తాడా, రబ్బరుబంతిలాగ, గులాబ్‌జామ్ లాగ, తొక్కుడులడ్డూలాటి ప్రేయసి ప్రేమను వదులుకుంటాడా? అబ్బ చెడ్డ సస్పెన్స్.... "ప్రేమకి మీసాలు" నవల మీరు చదవలేదా? చదవకపోతే మీ జన్మ జన్మంతా వేస్టే........